క్లుప్తంగా

సాంబశివరావు కుటుంబానికి అండగా ఉంటాం

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



గుంటూరు వెస్ట్: కొల్లిపర మండలం తూములూరు గ్రామంలో గత నెల 26న హత్యకు గురైన నాలాది సాంబశివరావు కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో మృతిని తల్లి విశ్రాంతమ్మ, సోదరుడు మునికుమార్, అక్క లావణ్యలతో కలెక్టర్ మాట్లాడారు. వారికి ధైర్యం చెప్పారు. మానిటరీ రిలీఫ్ ఫండ్ రూ.8.25 లక్షల్లో వెంటనే రూ.4,12,500 విడుదల చేస్తున్నామన్నారు. మిగితా డబ్బులు చార్జ్‌షీట్ దాఖలు చేయగానే అందిస్తామన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు విశ్రాంతమ్మకు పెన్షన్, ఇతర ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో పెద్ది రోజా సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సినీ నిర్మాత రామారావు

గుంటూరు మెడికల్: సినీ నిర్మాత, వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు మంగళవారం బీజేపీలో చేరారు. బీజేపీ ప్రజా పోరు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో పార్టీ కండువాకప్పుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడైన పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆర్జేడీ లింగేశ్వరరెడ్డిని ఆర్జేడీ కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు జోన్ పరిధిలోని ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరు జోన్‌ను విద్యాభివృద్ధిలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయుల సమష్టి సహకారం అవసరమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్జేడీని కలిసిన వారిలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల యూటీఎఫ్ నాయకులు ఉన్నారు.

నగరంలో సాయుధ దళాల కవాతు



గుంటూరు ఈస్ట్: అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలో ప్రత్యేక సాయుధ దళం కవాతు నిర్వహించింది. ఎస్ఐ నాగరాజు నేతృత్వంలో సాయుధ దళాలు శారదా కాలనీ, వసంత రాయపురం కాలనీల్లో కవాతు నిర్వహించాయి. సాయుధ దళాల కవాతును స్థానికులు ఆసక్తికరంగా చూశారు.

క్యారమ్స్‌లో గుంటూరు ప్రతిభ

గుంటూరు వెస్ట్(క్రీడలు): ఏపీ అంతర్ జిల్లాల రాష్ట్ర క్యారమ్స్ చాంపియన్‌షిప్ విజేతగా విశాఖపట్నం నిలిచిందని రాష్ట్ర క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2 నుంచి స్థానిక ఎల్‌వీఆర్ క్లబ్‌లో జరిగిన మ్యాచ్‌లు సోమవారం రాత్రితో ముగిసినట్లు చెప్పారు. ద్వితీయ స్థానం నెల్లూరు, తృతీయ స్థానం గుంటూరు జిల్లా సాధించిందన్నారు. పోటీల నిర్వహణను టోర్నమెంట్ కమిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ యాగంటి దుర్గారావు వ్యవహరించారన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్న మోదీ

గుంటూరు మెడికల్: నారీ శక్తి వందన్ యాత్ర కార్యక్రమం గుంటూరులో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి ప్రారంభమై హిమనీ సెంటర్ మహాత్మా గాంధీ విగ్రహం వరకు శక్తి వందన్ యాత్ర కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీకళ్యాణి, నాగమల్లీశ్వరి, మహాలక్ష్మి, స్రవంతి, మౌనిక, కత్తి మేరీ సరోజిని, ఏలూరి లక్ష్మి, పి.రవికుమార్, కె.శ్రీనివాస్ యాదవ్, చరక కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, పద్మనాభం, రేణుకా దేవి, కృష్ణ చైతన్య, సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ముస్తఫా, సమన్వయకర్త నూరిఫాతిమా



సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా

పట్నంబజారు: అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నాలుగో డివిజన్ నందివెలుగు రోడ్డు, జెండా చెట్టు సెంటర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి సమస్య వచ్చినా తాము పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే పేద వర్గాలు, ఆప్రాంత ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగినట్లు చెప్పారు. అర్హులైన పేదలకు నవరత్నాల లబ్ధి చేకూర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో మిగిలిన పనులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో తన కుమార్తె షేక్ నూరిఫాతిమాను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగనన్న చేసిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాయన్నారు. గత ప్రభుత్వ పాలనా విధానం, సీఎం వై.ఎస్.జగన్ పరిపాలనా విధానాన్ని ప్రతి ఒక్కరూ గమనించాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారులకు నేరుగా ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ అన్ని వర్గాలకు తానున్నాననే భరోసా కల్పించిన ఏకైక సీఎం వై.ఎస్.జగన్ అని కొనియాడారు. రాజకీయ లబ్ధి కోసం ఎవరెన్ని పొత్తుపెట్టుకుని ముందుకు సాగినా సీఎం జగనన్న ముందు చిత్తుకాక తప్పదని పేర్కొన్నారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెహమూద్, వైఎస్సార్ సీపీ నేతలు గోపి, కన్న, నూరుల్లా, రాజేష్, రమణారెడ్డి, నాగుల్‌మీరా, వెంకటేశ్వర్లు, ఆదినారాయణరెడ్డి, సుబ్బులు పాల్గొన్నారు.

57 డివిజన్‌లో పర్యటన..

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. నియోజకవర్గంలో 57వ డివిజన్ బసవతారకరామనగర్‌లో స్థానిక కార్పొరేటర్ పఠాన్ రిహానతో కలిసి పర్యటించారు. డివిజన్‌లోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ప్రెసిడెంట్ నూర్ ఖాన్, ఉషా పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు..



రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఎటువంటి సిఫార్సులు లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్నాయంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవే అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. 50, 53, 55 డివిజన్ల పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా నియోజకవర్గంలో లబ్ధిపొందిన ప్రజలకు ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు)తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి నేనున్నాంటూ భరోసా ఇవ్వాగలిగిన నేత ఎవరైనా ఉంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు.కార్యక్రమంలో కార్పొరేటర్లు దూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు గులాం రసూల్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాల్మన్, రాజేష్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏఎన్‌యూగా నాగజ్యోతి



నాగజ్యోతిని అభినందిస్తున్న రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థిని స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏఎన్‌యూగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఏఎన్‌యూలో ఈనెల 2న నిర్వహించిన అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకాన్ని సాధించింది. సంగడిగుంటలోని కళాశాలలో మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థిని టి. నాగజ్యోతి 76 కేజీల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి, అఖిల భారతస్థాయి పోటీలకు అర్హత పొందినట్లు చెప్పారు. తద్వారా స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఏఎన్‌యూగా ఎంపికవ్వడం కళాశాలకు గర్వకారణమన్నారు. కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపుతున్న తమ విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం ద్వారా తోటి విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌చార్జి సుభద్ర, ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, సాంస్కృతిక విభాగ సమన్వయకర్త మధుసూదన్, చైతన్య, వెంకటేష్ పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా చాటిన 'విజ్ఞాన్'



గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం పోటీలను నిర్వహించిన సర్టిఫికెట్లు, బెల్టులు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తైక్వాండో శిక్షకులైన కాశీనాథ్‌రెడ్డి, సాయి సుబ్రహ్మణ్యం విద్యార్థులకు ఇచ్చిన అత్యుత్తమ శిక్షణతో వారిని ప్రవీణ్యులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో జరిగిన తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు పతకాలు సాధించినట్లు వివరించారు.

బైక్ మాయంపై కేసు నమోదు

పెదకాకాని: పెదకాకానిలో బైక్ మాయంపై కేసు నమోదైంది. కొర్నెపాడు గ్రామానికి చెందిన చిలకా ఏసుబాబు సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రార్థనల నిమిత్తం పెదకాకాని తోటకు వచ్చాడు. స్థానిక స్టాండ్‌లో బైక్ పెట్టి ప్రార్థన చేసుకునేందుకు లోనికి వెళ్లాడు. తిరిగి రెండు గంటలకు స్టాండ్ వద్దకు వచ్చే సరికి బైక్ కనిపించలేదు. స్టాండ్ నిర్వాహకులకు టోకెన్ చూపించినప్పటికీ సరైన సమాధానం చెప్పలేదు. దీంతో బాధితుడు పెదకాకాని పోలీసులకు పార్కింగ్ నిర్వాహకుడిపై ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాలు.. తాడికొండ మండలం నరుకుళ్లపాడుకు చెందిన పేరుబోయిన సుబ్బారావు ద్విచక్ర వాహనంపై గుంటూరు వస్తున్నాడు. అదే విధంగా త్రిపురాంతకంకు చెందిన నార్నిపాటి తిరుపతయ్య, అమరావతిరోడ్డు నగరాలు వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న సుబ్బారావు రోడ్డు దాటుతున్న తిరుపతయ్యను ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. దీంతో తిరుపతయ్య, సుబ్బారావు గాయపడ్డారు. ఇరువురిని స్థానికులు 108లో జీజీహెచ్‌కు తరలించారు. తిరుపతయ్య పరిస్థితి విషమంగానే ఉందని సుబ్బారావు పరిస్థితి బాగానే ఉందని ఎస్ఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల మేధకు పదును



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు, రవీంద్రబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల మేధకు పదును పెట్టవచ్చునని గుంటూరు తూర్పు ఎంఈఓ పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మంగళవారం ప్రపంచ సుస్థిర శక్తి దినోత్సవం సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకత, ఆసక్తి, పట్టుదలకు వారు రూపొందించిన ప్రాజెక్టులు అద్దం పడుతున్నాయని అన్నారు. పాఠ్యాంశాలను చదవడంతో పాటు చదివిన అంశాలను అర్థం చేసుకుని, నమూనా ప్రాజెక్టులను రూపొందించడం ద్వారా విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా రాణించగలరని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ మేకల శేషకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రతి ఏటా సైన్స్ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్ర బాబు మాట్లాడుతూ ఇస్రో రాకెట్ లాంఛింగ్ మోటార్, ఇన్‌క్రెడిబుల్ ఇండియా, పునరుత్పత్తి వ్యవస్థ, యాసిడ్ రైన్, గుండె నమూనా, గ్లోబల్ వార్మింగ్, మానవ దేహం, డ్రిప్ ఇరిగేషన్, చంద్రయాన్ తదితర అద్భుతమైన ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల డైరెక్టర్లతో పాటు ప్రిన్సిపాల్ కళ్యాణి, హెచ్ఎం మీనాక్షి, సాయి శ్రీకర్ పాల్గొన్నారు.

పన్నుపై వడ్డీ రాయితీకి మూడు వారాలే గడువు

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 3 వారాలు మాత్రమే ఉంటుందని, నగరంలోని పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, నగర పజలు ఈ నెలాఖరులోగా తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని తెలిపారు. ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ యథావిధిగా ఉంటుందన్నారు. నగరంలో నిర్మాణంలో భవన యజమానులకు ఖాళీ స్థల పన్నుపై వడ్డీ రాయితీ ప్రకటించడం సదవకాశమని, నగరంలో ఖాళీ స్థల పన్ను విధించుకొని, ఇతర రాష్ట్రాలు, దేశాల్లో నివసించే యజమానులు కూడా వడ్డీ మినహాయింపు అవకాశాన్ని తెలియజేయాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించామన్నారు. పన్నుపై వడ్డీ రాయితీ ప్రజలకు తెలిసేలా నగరంలోని ప్రధాన సెంటర్స్ లో హోర్డింగ్స్ పై ప్రకటనలు వేయాలని సిటి ప్లానర్‌ని, పెద్ద మొత్తంలో నీటి పన్ను ఉండి, బకాయిలు చెల్లించని వారి ట్యాప్ కనెక్షన్ తొలగింపుకు ఒక్కో ఆర్ఐకి ఒక ఫిట్టర్‌ని కేటాయించాలని ఎస్ఈని ఆదేశించారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటుగా, భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డ్ సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని చెప్పారు. నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటరు చార్జీలు, డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

భాషా సాహిత్య భవనం ప్రారంభం



భాషా సాహిత్య భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన భాషా సాహిత్య భవనాన్ని మంగళవారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రారంభించారు. భాషా సాహిత్య నూతన భవనంలో ఇంగ్లిష్ విభాగం విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. ఈ భవనం పై మరొక అంతస్తు నిర్మించి అందులో తెలుగు సంస్కృత విభాగాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.కరుణ, ప్రిన్సిపాల్స్ సీహెచ్ స్వరూప రాణి, గంగాధర రావు, సిద్దయ్య, ప్రమీల రాణి, ఈ శ్రీనివాస రెడ్డి, ఇంగ్లీష్ విభాగాధిపతి జి.చెన్నారెడ్డి, సీడీసీ డీన్ కె.మధుబాబు, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, దూరవిద్య కేంద్రం పరీక్షలు కోఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, ఇంగ్లిష్ విభాగం అధ్యాపకులు, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

దిశ యాప్‌తో ఆత్మ రక్షణ



గుంటూరు మెడికల్: విద్యార్థులు, మహిళలు తమ స్మార్ట్ ఫోన్‌లలో తప్పనిసరిగా దిశ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలని, దీని ద్వారా ఆత్మ రక్షణ లభిస్తోందని వెస్ట్ ట్రాఫిక్ సీఐ వేమారెడ్డి అన్నారు. గోరంట్ల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో దిశ యాప్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణే ధ్యేయంగా దిశ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. యాప్‌ను ఏవిధంగా వినియోగించాలి అనే విషయంపై విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, విద్యార్థులు ఎక్కువగా ఫేస్‌బుక్, వాట్సాప్‌యాప్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాను వినియోగించే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఫోక్సో యాక్ట్ గురించి, సైబర్ యాక్ట్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉమెన్ ఎస్ఐ తరంగిణి, కానిస్టేబుల్ శివాంజలి, నర్సింగ్ పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి పవిత్రమైంది

జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని ఆ వృత్తికి మరింతగా గౌరవం పొందేలా కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. రోగులను ప్రేమగా పలకరించినప్పుడు వారిలో నూతన ఉత్తేజం కలుగుతుందని, ఈ వృత్తిని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. నర్సింగ్ విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశలు కాపాడాలని చెప్పారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను చేరాలంటే రోగులకు మంచిగా వైద్య సేవలు అందించాలన్నారు. ముందుగా నర్సింగ్ విద్యార్థులతో కళాశాల ట్యూటర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధికా, నర్సింగ్ సూపరింటెండెంట్లు కె.ఆశా సజని, గంగమ్మ, సమీనా, కిరణ్మయి, ఏం జ్యోతి బాబు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సేవలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా రోగి ఆరోగ్య వివరాలను భద్రపరుస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జనన, మరణ ధ్రువీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కేంద్రంలోని మెడికల్ రికార్డ్స్ గదులను తనిఖీ చేశారు. అక్కడ నెలకున్న అపరిశుభ్రమైన వాతావరణంపై ఆయన అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలోని ఎంఆర్‌డీ కేంద్రాన్ని ఆధునికీకరించడమే కాకుండా కంప్యూటీకరణ చేసి రోగుల సమాచారాన్ని పొందుపర్చనున్నట్లు తెలిపారు. భారత్ హెల్త్ ఖాతా (ఆభా) నెంబర్‌ను క్రియేట్ చేసి రోగి ఆరోగ్య సమాచారాన్ని సంపూర్ణంగా కంప్యూటీకరణ చేస్తారని వెల్లడించారు.

తప్పులు సరిచేస్తే ఫీజు లేదు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలలోని తప్పులను సరి చేసేందుకు వసూలు చేస్తున్న రూ.100లను ఇక నుంచి చెల్లించాల్సిన అవసరం లేదని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జనన, మరణ ధ్రువీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జనన మరణ ధ్రువీకరణ పత్రంలో తప్పులు సరి చేసేందుకు రూ.100 ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి ప్రజలు చెల్లించే వారని, ఇక నుంచి ఎవరు కూడా డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆయన వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు కె.ఆషా సజని, గంగమ్మ ఉన్నారు.

ఏఎన్‌యూతో సత్య ఇంపెక్స్ సంస్థ ఎంఓయూ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంతో గుంటూరుకు చెందిన చిల్లీస్ , సుగంధ ద్రవ్యాల ఎగుమతుల సంస్థ సత్య ఇంపెక్స్ లిమిటెడ్ మంగళవారం ఎంఓయూ(అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సమక్షంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సత్య ఇంపెక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టి.రామకృష్ణ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఆ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఎంఓయూలో భాగంగా ఏఎన్‌యూ ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగంతో కలసి సత్య ఇంపెక్స్ కంపెనీ పలు విద్య, వ్యాపార రంగ శిక్షణ, నైపుణ్య పెంపొందింపు కార్యక్రమాలు నిర్వహించనుంది. ఎంబీఏ విద్యార్థులకు కోర్సు రూపకల్పన, సిలబస్ ఎంపిక చేయటం, ప్రాజెక్టు వర్క్ కేటాయించడం, ఉపన్యాస కార్యక్రమాలు, ఎగుమతులపై శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయాలపై ఈ అవగాహన ఒప్పందంలో పరస్పర సహకారం ఉంటుంది. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా చాలా అవసరం అన్నారు. నిరంతరం గుంటూరు నుంచి మిర్చి, సుగంధ ద్రవ్యాలతో పాటు ఆక్వా ఫుడ్స్ ను చైనా, మలేషియా, వియత్నాం, అమెరికా వంటి దేశాలకు ఎగుమతులు చేస్తున్న సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఆయా అంశాల్లో నైపుణ్యం లభించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ చంద్ర , ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగాధిపతి ఆచార్య వి చంద్రశేఖరరావు, సహాయ ఆచార్యులు డాక్టర్ ఎస్ ప్రసన్న కుమార్, అధ్యాపకులు డాక్టర్ పి. విజయ వాణి, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ వి.చక్రవర్తి, డాక్టర్ జి.ఉమ పాల్గొన్నారు.

కల్తీ ఆహారంతో అనారోగ్య సమస్యలు



మాట్లాడుతున్న డాక్టర్ నిమ్మల శేషయ్య

లక్ష్మీపురం: కల్తీ ఆహారంతో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని సీనియర్ జనరల్ సర్జన్ డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి కళావేదికపై సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడారు. ఆహార పదార్థాలు కలుషితమయ్యే ముప్పు నుంచి ప్రజల్ని తప్పించటం అతి పెద్ద సవాలుగా మారుతోందన్నారు. వైరస్, బ్యాక్టీరియా పారా సైట్స్ వంటివి ఆహార పానీయాల్లో చేరి క్షణాల్లో లక్షల సంఖ్యలో పెరిగిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆ సమయంలో వాటిల్లోంచి కొన్ని విష పదార్థాలు విడుదలై జీర్ణ వ్యవస్థను మొత్తం అంతర వ్యవస్థను అనారోగ్య పరుస్తుందన్నారు. ఏవైతే మనం ప్రోటీన్లు అనుకుని అంటున్నామో ఇప్పుడ శరీరాన్ని విషతుల్యం చేసి చివరకు వ్యాధులకు కారణమవుతుందన్నారు. తాగే నీరు కలుషితమైన ఆయిల్‌తో అప్రమత్తంగా ఉండక పోతే డయేరియా మరణాలు తప్పవన్నారు. అనంతరం డాక్టర్ శేషయ్యను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.

తోటి బాలలకు మార్గదర్శకంగా ఉండాలి

ఎంఈఓ రమాదేవి



న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: బాలల సంఘాలలో ఉన్న వారు చైతన్యవంతులై సమస్యల్లో ఉన్న తోటి బాలలకు మార్గదర్శకంగా ఉండాలని మండల విద్యాశాఖాధికారి రమాదేవి అన్నారు. ప్రపంచ బాలల హక్కుల ఒడంబడికలో పొందుపరచిన హక్కుల సాధనలో భాగంగా పారా సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో బాలల హక్కుల సంఘాలు ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా మంగళవారం బాలల సంఘ సభ్యులు ప్రత్తిపాడు మండల విద్యాశాఖాధికారిని కలిసి, పారా సంస్థ న్యూస్ లెటర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంఈఓ మాట్లాడారు. తమ పాఠశాలల్లో విద్యార్థులతో బాలల సంఘాలు ఏర్పాటుచేసుకుని, ప్రతి నెల సమావేశమై బాలలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చిస్తున్నామన్నారు. బాలల సంఘాల ఏర్పాటు మరియు మానవ హక్కుల విద్యా బోధనను పాఠ్య ప్రణాళికలో ఒక పాఠ్యాంశంగా చేర్చి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేలా తమ విన్నపాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని ఎంఈవోను కోరారు. కార్యక్రమంలో ఎంఈవో–2 లీలారాణి, పారా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ తురకా మంగయ్య, ఝాన్సీ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రత్తిపాడు: బాల్య వివాహాలు అనర్థాలకు దారితీస్తాయని ఐసీడీఎస్ గొట్టిపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వి.అరుణ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కిశోర బాలికలకు, తల్లులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై వారికి వివరించారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండకుండా ఎవ్వరూ వివాహం చేసుకోకూడదని చెప్పారు. బాల్యవివాహాల వలన మానసిక ఎదుగుదల లేకపోవడం, అనారోగ్య సమస్యలు తలెత్తడం, రక్తహీనతకు గురవ్వడం జరుగుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా పుట్టే పిల్లలకు అంగవైకల్యంతో కూడిన పిల్లలు పుట్టే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్, మాధవి బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.కుసుమ, పి.అక్కమ్మ, దేవిక, రమణ, ద్వారకా పాల్గొన్నారు.